నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం-40



# ఎంత గొప్ప కథయినా మాండలికంలో మరుగున పడిపోతుంది

## - ఇచ్ఛాపురపు రామచంద్రం

ఇచ్ఛాపురపు రామచంద్రం సునాయాసంగా వందలాది కథలు, అనాయాసంగా పదుల సంఖ్యలో నవలలు రాసిన రచయిత. జీవితంలో ఎదురైన ఏ అనుభవాన్నయినా, ఇతరుల జీవితంలో చూసిన ఏ సంఘటననైనా కథగా మలిచే సత్తాగల రచయిత. మానవతావాదమే తప్ప మరే ఇతర వాదాల జోలికి పోకుండా ఇజాల గజాలలో బందీ కాకుండా పాఠకుల ఆలోచనా పటిమను జాగృతం చేసేందుకు కలం పట్టిన కథకుడు. 'ఓ హెన్రీ'కి ఏకలవ్య శిష్యునిగా గర్వంగా ప్రకటించుకుంటూ ఇప్పటికీ జీవితాన్ని దాటిపోకుండా, సంఘానికి పెడత్రోవ చూపకుండా సమర్థవంతంగా కథలు రాయగలనని ధీమాగా, నమ్మకంగా చెబుతున్నారు. సాటిమనిషిని ఒడుపుగా అర్థం చేసుకుంటే సమాజాన్ని సులువుగా ఆకలింపు చేసుకోవచ్చుంటున్న నడిచే కథల కర్మాగారం 'ఇచ్ఛాపురపు' వారితో ఈ వారం ఇంటర్వ్యూ.

## నాన్న, అన్నయ్యే ఆదిగురువులు

1940 జూన్ 16న నర్సీపట్నం (విశాఖ జిల్లా)లో పుట్టాను. నాన్నగారు ఇచ్ఛాపురపు వైద్యనాథం. తెలుగు పండితులు. 'అర్జున విజయం' అనే గ్రంథ రచయిత. అన్నయ్య ఇచ్ఛాపురపు జగన్నాథం ప్రముఖ రచయిత. 'గులాబీ ముల్లు' నవలతో పాటు ఎన్నో మంచికథలు రాశారు. వీరిద్దరే నాకు ఆది గురువులు. అమ్మ సత్యవతి రచయిత్రి కాకపోయినా పురాణాలు పుక్కిట పట్టింది. కుటుంబ నేపథ్యం వల్లే నా రచనామార్గం సుగమం అయింది. కలిమి లేదు, లేమీ లేదు, సాఫీగా నడిచిపోయిన మధ్య తరగతి కుటుంబం మాది. నా చిన్నప్పటికే అన్నయ్య ప్రముఖ రచయిత కాబట్టి అతని కోసం వచ్చే రచయితలు ఈరంకి వెంకటరావు (తుని), భమిడిపాటి వెంకటరావు తదితరులకి కాఫీలందించి వాళ్ల కబుర్లు వినే వాడిని. అర్థమైంది తక్కువైనా, ఆ సంభాషణలు ఆసక్తిగా ఉండేవి.

## ఫిఫ్త్‌ఫారమ్ నుంచే సాహిత్య అధ్యయనం

ఫిఫ్త్‌ఫారమ్‌లోకి వచ్చాక కొమ్మూరి సాంబశివరావు, విశ్వప్రసాద్, టెంపోరావు మొదలైన వారి డిటెక్టివ్ నవలలు వారు రాసిన లాలస, మంజువాణి, జోకర్ వంటి సాంఘిక నవలలు కూడా రోజుకొకటి చదివేవాడ్ని. అప్పట్లో అలాంటి పుస్తకాలు కొంటే రూపాయి పావలా, అద్దెకి రోజుకి అణా. నేను ఊళ్లో మంచి పేరున్న వైద్యనాథం అబ్బాయిని కాబట్టి నాకు అర్థణాకే (అణాలో సగం) బాడుగ కిచ్చేవారు షాపు వాళ్లు. కొవ్వలి, జంపన రాసిన నవలలు మా ఇంట్లో అద్దెకున్న వాళ్లు తెచ్చేవాళ్లు. అన్నయ్యకు వచ్చే 'తెలుగుస్వతంత్ర' లాంటి పత్రికలు బాగా చదివేవాడ్ని. క్లాసులకు తప్పకుండా వెళ్లి పాఠాలు వినడమే తప్ప, ఇంటికొచ్చిన తరువాత అవి చదివే అలవాటు లేదు. ఎస్.ఎస్.ఎల్.సి. నాటికి మా ఊరి శాఖా గ్రంథాలయంలోని తెలుగు పుస్తకాలన్నీ (అనువాదాలతో సహా) చదివేశాను. చలం, శరత్‌ల సాహిత్యం నన్ను బాగా ప్రభావితుణ్ణి చేశాయి.

## లెక్చరర్ కోసం చదివేవాడ్ని

అనకాపల్లి ఎ.ఎం.ఎల్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే రోజుల్లో నాకంటే బద్ధకస్తులైన ఓ తెలుగు లెక్చరర్ నాకు 'ఆల్బర్టో మొరావియా' రాసిన పుస్తకాలు ఇస్తూ ''చదివి, ఓ పేరాలో కథ రాయి. అది చదివి నేను పుస్తకమంతా చదవాలో వద్దో తేల్చుకుంటాను'' అన్నారు. లెక్చరర్ మీద అభిమానం కొద్దీ 'ఉమెన్ ఆఫ్ రోమ్.. టూ అడాలసెంట్స్' మొదలైన నవలలు చదివి కథాంశం రాశాను. అలా ఆంగ్ల నవలల మీద ఆసక్తి కలిగింది. తరువాత ఎ.జి.గార్డెనర్, కానన్ డయిల్, ఆర్థర్ హెయిలీ, ఇర్వింగ్‌వాలెస్, రాబర్ట్ లుడ్‌లుమ్' తదితర ఆంగ్ల రచయితల రచనలు చదివాను.

## తొలి కథ కాలేజీ మేగజైన్‌లో ...

ఫోర్త్‌ఫారంలోకి వచ్చేవరకూ రోజూ పలకమీద ఓ వైపు తెలుగు, మరో వైపు పదహారు పదహార్ల వరకూ ఎక్కాలు రాసి గేటువద్ద చూపకపోతే బెత్తంతో అరచేతి మీద కొట్టిగానీ బడిలోకి రానిచ్చే వారు కాదు. అలా రాయడంతో దస్తూరి బాగా వచ్చింది. చేతిరాత బాగుందని కాలేజీ మ్యాగజైన్ ఎడిటోరియల్ బోర్డులో వేశారు నన్ను. బాగులేని రాతలను కంపోజిటర్‌కు అర్థమయ్యేలా అందంగా తిరిగి రాయడం నా పని. అప్పుడు కాలేజీ మ్యాగజైన్‌లో మేటర్ చాలకపోతే 'నన్నే ఓ కథ రాయమన్నారు. ఆపద్ధర్మంగా రాసిన ఆ కథే (పేరు గుర్తులేదు. మ్యాగజైన్ కూడా అందుబాటులో లేదు) నా తొలి కథ. సిరా తడి ఆరకుండానే అచ్చయింది.




## ఆరు నెలల్లో 50 కథలు

మలి కథకు అందమైన అమ్మాయి ప్రేరణ. అప్పట్లో కథల్లో ఏ అమ్మాయైనా అందంగానే ఉండేది. బి.ఏ. పరీక్ష రాసి ఇంటికొచ్చి పుస్తకాల కోసం బ్రాంచి లైబ్రరికి వెళుతుండగా ఓ అందమైన అమ్మాయి తారసపడింది. ఆ అమ్మాయిని చూసి ఓ కథ రాసాను. బోలెడన్ని కథలు చదివాను కనుక ఆ కథ రాయడం ఏ మాత్రం కష్టమనిపించలేదు. రాసి 'చిత్రగుప్త'కు పంపాను. చిత్రంగా ఓ నెల తిరిగాక ఆ పత్రిక నాచేతికందింది. ఆశ్చర్యం! అందులో నా కథ అచ్చయింది. నా పేరుతో పాటు ఊరి పేరు కూడా పడింది. అంతకంటే ఆశ్చర్యం... ఆ కథకు పది రూపాయల లోపు పారితోషికం కూడా పంపారు. గుప్తంగా ఉంచవలసిన కథేమీ కాదు. అందరికీ చూపి గర్వంగా తలెత్తుకునే తిరిగాను. నర్సీపట్నం అప్పటికి చిన్న ఊరే కనుక నేను కథలు రాస్తానని చాలామందికి తెలిసి పోయింది. నాన్నగారు నా ప్రయోజకత్వానికి పరవశించారు. 'అచ్చు... పారితోషికం' రుచి మరిగిన పులినై చిత్రగుప్త, జగతి, ఢంకా, ప్రజామత... ఇలా పత్రికలన్నింటికీ నా రచనలు పంపాను. వాళ్లూ అచ్చేశారు. ఆరునెలల్లో రికార్డు స్థాయిలో 50 కథలు రాశాను. 'ఆంధ్ర మహిళ' లాంటి పత్రికలకు మా అక్క పేరుతో కథలు పంపాను. నా శ్రీమతి పేరుతో కూడా కొన్ని రాశాను.

## ఉద్యోగంలో ప్రముఖుల పరిచయం

ఎల్ఐసిలో ఉద్యోగం వచ్చింది. బందర్లో పోస్టింగ్. అప్పట్లో ప్రముఖ రచయిత సింగరాజు రామచంద్రమూర్తి మా ఆఫీసులోనే పని చేసేవారు. అప్పుడే, ప్రముఖ రచయిత 'ఆదివిష్ణు' తొలి కథ రాశాడు. బందరు (మచిలీపట్నం) నుంచి 'చుక్కాని' అనే మాసపత్రిక వచ్చేది. అందులోనూ నా కథలు వచ్చాయి. ఆంధ్రపత్రికలో పని చేస్తుండే హవిస్, సింగరాజు, ఆదివిష్ణు బందర్లో కలుసుకుని కథల గురించి మాట్లాడుతుంటే, నేనూ వినేవాడ్ని. పెద్ద రచయితల ప్రభావంతో పెద్ద పత్రికలకు కథలు రాద్దామని అప్పుడే అనుకున్నాను. అంతలో విశాఖపట్నం బదిలీ అయింది. అప్పటికి నేను రాసిన తొలి నవల 'నవోదయం' రాత ప్రతిని ఓ మిత్రుడు చదివి

మద్రాసులోని ఓ పబ్లిషింగ్ హౌస్‌కి పంపాడు. విశాఖలో రంగనాయకమ్మ గారిని కూడా అప్పుడే కలిశాను. ఓ శుభోదయాన 'నవోదయం' నవల అచ్చయిన పుస్తకాలు నాకు అందాయి. కలయో, వైష్ణవమాయో అనిపించింది. అప్పుడు ఆ మిత్రుడు మిస్టరీ విప్పాడు. ఆ నవల తనే పబ్లిషర్స్‌కి పంపేనని. ప్యాకెట్ సైజు నవలకు 50 రూపాయల పారితోషికం వచ్చింది. ఆఫీసులో నేను రచయితనని తెలిసి కొందరు సహోద్యోగులు ఇంకా రాయమని ప్రోత్సహించారు. అదే సమయంలో కారా మాస్టారు, భరాగో, రావి శాస్త్రి, బలివాడ కాంతారావు, అవసరాల రామకృష్ణారావు వంటి సాహితీ మిత్రుల పరిచయం కలిగింది.

### ప్రచురణ కర్తల ప్రోత్సాహం

ప్రచురణకర్తలు డిటెక్టివ్ నవలలు రాయమని ప్రోత్సహించే వారు. స్వయంకృతం, చీకటి గదులు, మృత్యువుకి మూడు మెట్లు, మర్డర్‌కాల్ నవలలు అలా రాసినవే! ఓసారి మద్రాసు వెళ్లాల్సి వచ్చింది. అక్కడే సహస్రాధిక నవలా రచయిత 'కొవ్వలి' గార్ని కలుసుకోగలిగాను. డబ్బులన్నీ ఖర్చయిపోయాయి. తిరుగు ప్రయాణానికి డబ్బుల్లేవు. అప్పుడు అక్కడి ప్రచురణ కర్తలు 450/- రూపాయలు ఇచ్చి ''దీన్ని డబ్బు రూపంలో మేం వెనక్కి తీసుకోం. డిటెక్టివ్ నవలలు రాసి అప్పు చెల్లించు''మన్నారు. అలా రాయబోయే రచనలకు ముందస్తు రొక్కం అందుకున్న అనుభవం ఆనందాన్నిచ్చింది.

### బహుమతులు

ఉద్యోగరీత్యా శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలికి బదిలీ అయింది. అక్కడ 'జైరాజ్' అనే సాహితీమిత్రుడు తనూ రాస్తూ నన్ను రాయమని ప్రోత్సహించాడు. అప్పుడే 'ఆంధ్ర విశ్వసాహితి' నవలల పోటీ పెట్టింది. 'అంతర్వాహిని' అనే నవల పంపాను. ప్రథమ బహుమతి వచ్చింది. మరుసటి సంవత్సరమే కథల పోటీలో 'దారి పక్క దీపాలు'కు మొదటి బహుమతి వచ్చింది. ఆత్మవిశ్వాసంతో పాటు రచనల మీద శ్రద్ధ పెరిగింది. ఆఫీసులో కూడా చక్కని వాతావరణం ఉండేది. వందల సంఖ్యలో రాసి అన్ని పత్రికలకు పంపాను. విజయ మాస పత్రికలో నవలలకు బహుమతులతో పాటు, యువ, చక్రపాణి అవార్డులు అందుకున్నాను. ప్రముఖ రచయిత్రి లత 'ఊహాగానం'పై తనకన్నా ఇచ్ఛాపురపు రామచంద్రానికే ఎక్కువ అథారిటీ అని స్వయంగా చెప్పడం ప్రత్యేక ప్రశంసగా తీసుకున్నాను.

### ఓ హెన్రీ కథలకు నాటిక రూపం

అనకాపల్లికి బదిలీ అయిన తరువాత నాకు మరింత వెసులుబాటు కలిగింది. ఆఫీసులో రచయిత బి.వి.జి.నరసింహారావు వంటి మిత్రులనుంచి మంచి ప్రోత్సాహం లభించింది. విశాఖపట్నం ఆకాశవాణి వారు 'సాక్షి' వ్యాసాలను నాచేత నాటికల రూపంలో రాయించి ప్రసారం చేశారు. ఓ హెన్రీ కథలను కూడా అప్పడే నాటికల రూపంలో రాశాను. ప్రసారం అయ్యాయి. ఎప్పటికైనా 'భారతి' పత్రికలో కథ పడితే అప్పుడే నేను నిజంగా మంచి రచయితను అనుకునే వాడిని... 'అరటితొక్క' కథతో ఆ కోరిక నేరవేరింది. సహధర్మచారిణి కుసుమకుమారి పోయిన ఏడాదికి ఉద్యోగం కూడా నన్ను వదిలేసింది. అప్పుడే ప్రచురణకర్తలు నాకు బాల సాహిత్యం రాసే అవకాశం కల్పించారు.

### సులభ శైలిలో కాశీమజిలీ కథలు

జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, భట్టి విక్రమార్క మొదలైన నవలలతో పాటు, జానపదాలు, పంచతంత్రం కథలతో 30 పుస్తకాలు రాశాను. మధిర సుబ్బన్న దీక్షిత కవిగారి కాశీమజిలీ కథలను (5500 పేజీలు) నేటి సాధారణ పాఠకులు సులభంగా చదువుకునేలా 2400 పేజీలకు కుదించి సరళమైన భాషలో రాశాను. 'తెలుగు వాక్యాన్ని ఇంగ్లీషులోకి మార్చడం ఎలా?' అన్న ఆంగ్ల పుస్తకాన్నీ రాశాను.

### నాకు నచ్చినవి

| | | |
|---|---|---|
| కథ | : | పావుగంట సంస్కృతి (ఆలపాటి లక్ష్మీనరసింహారావు) |
| రచయిత | : | మధురాంతకం రాజారాం |
| సినిమా | : | చివరకు మిగిలేది |
| పాట | : | మనసున మల్లెల మాలలూగెనే (మల్లీశ్వరి) |
| గాయని | : | ఎస్.జానకి |
| గాయకుడు | : | జేసుదాస్ |
| హీరోయిన్ | : | సావిత్రి |
| వంట | : | తినేవన్నీ |
| చిత్రకారుడు | : | వడ్డాది పాపయ్య |

### రచయితగా ఆనందించిన సందర్భం

దాదాపు అన్ని పత్రికల కథల పోటీల్లో, నవలల పోటీల్లో ఎన్నో బహుమతులు అందుకున్నాను. 'మీ కథలు నాకిష్టం. నా ఖర్చుతో ఓ సంపుటి వేయిస్తాను' అని విశాఖపట్నంలోని ప్రముఖ హోమియో వైద్యులు మోటూరి శ్రీరామకృష్ణగారు 'సిద్ధార్థ' కథా సంపుటిని వేయించినప్పుడు నన్ను నేను అభినందించుకుని ఆనందించాను. నా కథ 'స్నేహితుడు' చదివిన ఓ పెద్దాయన 'వృద్ధుల సున్నిత సమస్యను ఎంతో ఇష్టంగా చిత్రించావు' అని పార్కర్ పెన్ బహూకరించినప్పుడు మరింత పొంగి పోయాను. ఒక ప్రముఖ పత్రికలో పడిన 'ఈవ్‌టీజర్' నవల చదివి 'నేను ఇవాళ్టి నుండి టీజింగ్ మానేశాను' అని ఒక విద్యార్థి పాఠకుడు ఉత్తరం రాసినప్పుడు, నా కథలూ, రచనలు సమాజానికి ద్రోహం చేయవు అని నిర్ధారించుకుని గర్వపడ్డాను.

### ఇంకా రాస్తాను

ఇప్పటికి 500లకు పైగా కథలు, 50 నవలలు అచ్చయ్యాయి. రాసినందుకు సిగ్గుపడాల్సిన కథలు గానీ, సమాజానికి, వ్యక్తికో ద్రోహం చేసేవిగాని, మనిషి మెదడును వక్రమార్గం పట్టించే రచనలు గాని నేను చేయలేదని ఖచ్చితంగా చెప్పగలను. చెట్టూ, చేమ, కాయ పండు కానిదేదీ కథకు అనర్హం అని అనుభవ పూర్వకంగా తెలుసుకున్న వాడ్ని కనుక, 'ఏడాది పాటు కథ రాయకపోతే ఇక అతను రచయిత అనిపించుకోవడానికి తగడు' అని వ్యక్తిగత అభిప్రాయం కలవాణ్ణి కనుక ఇప్పటికీ రాస్తున్నాను. రాయకుండా ఉండలేను.

### నేటి కథకులు, వారి కథలు

మంచి కథలు రాస్తున్నారు. చాలావరకు బాగుంటున్నాయి. అయితే, ప్రాంతీయంగా కొందరు విడిపోయి గిరి గీసుకుని మాండలికంలో రాయడం వల్ల, ఆ కథలు అందరికీ అర్థమయ్యే అవకాశం లేకుండా పోతోంది. 'అందరూ చదవాలనే కదా, వార్తాపత్రికలు మాండలికంలో లేవు! మాండలికంలో ఉండి పోతే ఎంత మంచి కథ అయినా, గొప్పకథ అయినా మరుగున పడి పోతుందని నా అభిప్రాయం, నా బాధ.

### ఆశయం

అప్పటి పెద్ద కథలు (పొడవు కథలు) ఇప్పుడు చిన్నకథలు (పొట్టి కథలు)గా మారడం నాకు హాయిగా ఉంది. కొత్తకథా వస్తువు, వైవిధ్యం ఇవే నా కథల వెనక కిటుకులు. 'శిల్పం' మీద అంతగా దృష్టి పెట్టను. 'రచయిత పేరు తీసేస్తే, నేనే ఆ కథ రాశానని పాఠకులకు దొరకనంతగా దేనికదిగా ఉండాలి కథ' అనేది నా దృక్పథం. అలా ఎప్పుడూ రాయాలన్నదే నా ఆశ, ఆశయం.

-మేడా మస్తాన్‌రెడ్డి

నాకు నచ్చిన నా కథ

# మెరుపుతెరలు

- ఇచ్ఛాపురపు రామచంద్రం

''ఆ నీలం చీరా, గులాబీరంగు ఫ్రాకూ విడివిడిగా ప్యాక్ చేయిం చండి'' అంటూ నాలుగు పది రూపాయల నోట్లను కౌంటర్‌మీద పెట్టాడు శ్యామసుందర్. కొద్ది నిమిషాలలోనే కుర్రవాడందించిన పాకెట్లు తీసుకుని, సమీపంలో ఉన్న దుకాణంలో బాణా సంచా కూడా కొని సంచీలో వేయించి క్వార్టర్స్ వంక నడవ సాగాడు.

చీకటి పడకపోయినా దీపాలు వెలుగుతున్నాయి.

రోడ్డు జనసందోహంతో నిండి ఉంది.

మెల్లగా జనాన్ని తప్పించుకుంటూ అర్ధమైలు నడిచి అతనిల్లు చేరుకునేసరికి బాగా చీకటిపడి పోయింది.

ప్లాస్టిక్ సంచిలోంచి పాకెట్లు తీసి టేబుల్‌మీద పెడుతూంటే, అతనికా నీలి చీరను మళ్ళీ చూడాలనిపించింది. సిలోఫెన్ పాకెట్‌లోంచి మిలమిల మెరుస్తున్న చీరను చేతుల్లోకి తీసుకుని మృదువుగా వేళ్ల చివరలతో ఆ పాకెట్టుని నిమిరేసరికి అతనికి నీరజ బుగ్గలు గుర్తుకొచ్చాయి. ఒక్కసారి ఆ స్పర్శ అతనిలో చాలా అను భూతులను జ్ఞాపకాలను ఉదయింపజేసింది.

అతను లోపలకు వెళ్లి ముఖం కడుక్కుని, తుడుచుకుంటూ తిరిగి ఆ గదిలోకి వచ్చేసరికి, టేబుల్‌ముందు నిలుచుని పాకెట్ తెరిచి ఫ్రాక్ పైకి తీయాలని తీవ్రంగా ప్రయత్నిస్తూంది శ్యామా!

శ్యామసుందర్ నవ్వుకుంటూ ఆమెవంకే చూడసాగాడు.

తెల్లవారితే దీపావళి!

బాణాసంచా కాల్చుకుందుకు పిల్లలకీ, కొత్తబట్టలు కట్టుకుందుకు ఆడవాళ్లకీ మహదవకాశం కల్పించే పండుగ.

పక్క క్వార్టర్సులో వయస్సు వచ్చిన పిల్లలు టపాకాయలు పేలుస్తూ రేపు రావలసిన దీపావళిని ఇవాళే అట్టహాసంగా ఆహ్వానిస్తున్నారు.

పెద్దశబ్దంతో అతి సమీపంలో టపాకాయలు పేలేసరికి శ్యామా తుళ్లిపడింది. పాకెట్‌తో సహా ఆమెను ఒడిలోకి తీసుకుని ఆపిల్స్ లాటి రెండు బుగ్గలపైనా మృదువుగా ముద్దు పెట్టుకుని - ''ఎలా ఉంది శ్యామా నీ ఫ్రాక్?'' అంటూ అడి గాడు.

''బలేగా ఉంది మామయ్యా! థాంక్స్''.

శ్యామా ముద్దుగా కృతజ్ఞత తెలుపుతున్న ఆ క్షణాలలోనే నీరజ అక్కడకు వచ్చింది. ఆమె దృష్టి టేబులుమీద మిలమిల మెరుస్తున్న చీర మడతపై పడేసరికి -- పెదవులు మందహాసంతో కొంచం విచ్చుకున్నాయి.

రెండడుగులు ముందుకువేసి ఆ పాకెట్టును చేతులలోకి తీసుకుంటూ ''కాంప్లె క్షన్‌కి సరిపడే కలరు తెచ్చారు. ఈ స్కై బ్లూ నాకు చాలా ఇష్టమని గుర్తుంచుకు న్నందుకు థాంక్స్'' అందామె అతని ముఖంలోకి చూస్తూ.

ఆమె అభినందనలను సంతోషంగా అందుకున్నట్లు తనూ నవ్వేడు.

ఒక్కక్షణం ఊరుకుని అడిగిందామె. ''ఒక్కటే తెచ్చారేం? మీ అక్కయ్యా?'' లోపల నుంచి శారద పిలుపు వినిపించింది. ఆమె సగంలోనే మాట ఆపేసింది. ఒక్కసారి అతని కళ్ల ముందు వేయి మెరుపులు మెరిసినట్లయింది. ఆ మెరుపుల లోంచి వెలువడిన తన కర్తవ్యం తలుచుకుని అతను తుళ్లిపడ్డాడు.

''ప్లీజ్... అది విప్పకు నీరజా!'' ఎలాగో అన్నాడు శ్యామసుందర్.

''ఏం? సస్పెన్సా?'' కుతూహలం వ్యక్తపరుస్తూ చూసింది నీరజ.

అతను సమాధానం చెప్పకుండా ఆకస్మికంగా ఏదో సమస్య ఎదురైనట్లు గంభీ రంగా మారిపోయాడు.

''నీరజా!'' మళ్లీ లోపలినించి పిలుపు.

ఇంకా ఆమె చీరవంకే చూస్తూ నిలబడటం గమనించి - ''అక్కయ్య పిలు స్తూంటే వినబడటం లేదూ? నువ్వు త్వరగావెళ్లు. లోపల అక్కయ్య ఒక్కర్తీ ఏం బాధపడు తూందో?''

ఆమె ఒక్కసారి అతని ముఖంలోనికి చూసి విసురుగా వెళ్లిపోయింది అక్కడి నుంచి. ఆ వైఖరిచూసి అతని కనుమానం కలిగింది - 'నీరజకు కోపం రాలేదు కదా?'

ఈ రెండు నెలల సాంగత్యంలోనూ నీరజను గురించి అతను చాలావరకు తెలుసుకో గలిగాడు. కాపరానికి వచ్చినా ఆమెలో ఇంకా చిన్నపిల్లల మనస్తత్వమే ఉండి పోయింది. కొంచం ఉద్రేకం కల మనిషి. దానికి కారణం ఆమెలోని పసి తనమే. ఆ పసితనం నీరజలో ఒకరకమైన మాధుర్యం కలిగిస్తుంది అతని ఉద్దే శంలో. అందుకే ఆమెలో ఆ సున్నితమైన అమాయికత్వం ఏమాత్రమూ దెబ్బతిన కుండా కాపాడుకుంటూ వస్తున్నాడతనీ రెండు నెలల నించీ. ఆమె పట్ల అతి జాగ్ర త్తగా ప్రవర్తించడం దాదాపు అలవాటై పోయిందతనిలో.

'నిజంగా నీరజకు కోపం రాలేదు కదా?'

అలా జరగకూడదు. నీరజ కోపం తను భరించలేడు.

ఈ చలిరాత్రి... వంటరితనం. బహుదుర్భరమైన శాపం. చాలా రాత్రులు నైట్ డ్యూటీ లోనే గడిచిపోయే తన కపురూపంగా లభించిన ఈ సువర్ణావకాశాన్ని వృథా చేసుకోవడం ఏమాత్రమూ తెలివైన పని కాదు.

''శ్యామూ!''

తలఎత్తి చూశాడతను. చీర కొంగుకి చెయ్యి తుడుచుకుంటూ వచ్చింది శారద క్కయ్య.

''వంట అయిపోయిందా?''

''ఊఁ. పిండి వంటలతో సహా అన్నీ అయిపోయాయి. నీకిష్టమని జిలేబీ చేశాను''.

''పండుగకు వచ్చావన్నమాటే కాని నీకిక్కడా శ్రమ తప్పడం లేదు''.

''ఆడవాళ్లకి వంటలూ, వార్పులు శ్రమేమీ కావులే. అయినా మీ బావగారికి అనుకోకుండా కాంప్ తగలడమూ, నన్నిలా పంపడమూ జరగకపోతే ఇంత త్వరగా మీ కొత్త కాపరం చూడటమే అయ్యేదికాదు. మిమ్మల్ని చూస్తూ పండగ గడపగలిగే ఆనందం ముందు ఈ శ్రమేపాటిది?'' అంటూ కుర్చీ లాక్కుని కూర్చుంటూ అప్రయత్నంగానే ఆ చీర మడత వంక చూసిందామె. ఒక్కక్షణం...

''చీర తెచ్చావా!'' ఆత్రుత ధ్వనించిందామె స్వరంలో.

శ్యామసుందర్ ముఖం రంగులు మారింది.

ప్యాకెట్‌లోంచి చీర మడతను పైకి తీసి భుజంమీద వేసుకుని ఏవో అంచనాలు వేస్తున్న ఆమెను చూసి, ఏదో అవాంఛనీయమైన విషయం తెలుసుకోవలసి వస్తు న్నట్లు తన మనసు చేదుగా అయిపోయింది.

''చాలా బాగుంది శ్యామా!'' చిరునవ్వుతో తన అభినందనలు తెలియజేసిం దామె. కాని, అతనవి గ్రహించలేకపోయాడు.

ఈ వయస్సులో అక్కయ్యకి కూడా ఇటువంటి సరదాలు!

ఆశ్చర్యం వేసిందతనికి. అంతలోనే ఆశ్చర్యం మాని ఆలోచించసాగాడు. వయసుకి సరదాలకీ ఆట్టే సంబంధం ఉండనవసరం లేదేమో? ఆడవాళ్లకి అలంకా

రాల మీదా, చీరల మీదా ఆజన్మాంతమూ అభిమానమే. అయినా, అక్కయ్య ఏమంత వయస్సు మీరినదని? ముప్ఫయ్యేళ్లు వచ్చినంత మాత్రాన, ఒక బిడ్డను కన్నంతమాత్రాన సరదాలు మిగుల్చుకోవడంలో అసహజతా, అన్యాయమూ ఏమున్నాయి? ఆమె తనకంటే ఆరేళ్లు పెద్ద. నీరజకంటె పన్నెండేళ్లు పెద్ద. తనకూ అక్కయ్యకూ మధ్యనున్న వయోభేదమే తన జీవితాన్ని కొంతవరకూ మెరుగు పరచగలిగింది.

అమ్మలా ఆదరించకపోయినా, నాన్నలా పెద్ద చెయ్యకపోయినా, అక్కయ్య తనకు చాలాసార్లు సాయం చేసింది. ఇంటర్ చదువుతూండగా అప్పుడప్పుడు ఆర్థిక సహాయం చేసేది. అంతకంటే ముఖ్యంగా తను ఇంటర్ అయ్యాక ఉద్యోగం సంపాదించలేక ఖాళీగా తిరుగుతూంటే తనకీ ఉద్యోగం రావడానికి కారణ భూతురాలైంది. తను పద్ధతుల మనిషనీ, రికమెండేషన్లపై ఉద్యోగం రావడం సహించడనీ తెలిసి కూడా ఎలాగో శ్రమపడి బావగారి పలుకుబడితో తనకీ ఉద్యోగం వచ్చేటట్లు చేసింది. అయితే ఆ విషయం ఉద్యోగంలో చేరాక కానీ తనకు తెలియదు.

ఇంటర్‌పాసైన తనకీమాత్రం ఉద్యోగం దొరకడం కష్టమే. ఈ ఉద్యోగం పరోక్షంగా అక్కయ్య పెట్టించిన భిక్షే. కాని ఉద్యోగంలో చేరాక ఇంతవరకూ తను అక్కయ్య కే విధంగానూ కృతజ్ఞత తెలుపుకోలేకపోయాడు. పరిస్థితులటువంటివి. కనీసం ఇప్పుడైనా తను కృతజ్ఞత తెలుపుకోవాలి. బంధువుగా తనింటికి వచ్చిన అక్కయ్య నేదో విధంగా సత్కరించి పంపాలి.

అతని మెదడులో నీలి చీర మెదిలింది.

రేపు అక్కయ్యకాచీర ఇస్తే...

మరుక్షణం నీరజ గుర్తుకు వచ్చింది.

శారద, నీరజ – రెండు అవధులకీ నడుమ అతని ఊహలు ఊయలలూగసాగేయి. ఈసారి అతనికి తను చేసిన పొరపాటు స్పష్టంగా తెలిసి వచ్చింది.

ఆ చీర అందాన్నిచూసి, ముచ్చటపడి దాన్ని తీసుకోవడంలో తను నిజంగా చాలా పొరపాటే చేశాడు.

ఇంట్లో ఇద్దరాడవాళ్లుండగా ఒక్క చీర తేవడం అన్యాయం. ఆ చీరలో నీరజను ఊహించుకుని త్వరపడి చీరను తీసుకున్న ఆ క్షణాలలో అక్కయ్య విషయం విస్మరించడం మహాపచారం.

చేజేతులా సమస్యను తెచ్చిపెట్టుకున్నాడతను. తనవద్ద పది రూపాయలు మాత్రమే మిగిలాయి. వీటితో నెలాఖరు వరకూ గడపాలి. అందరికీ పండుగే కనక అప్పు దొరకడం కూడా కష్టమే. అదీకాక ఇంతవరకూ జీవితంలో ఏనాడూ అప్పు చెయ్యలేదు తను. ఆ విష వలయంలో చిక్కుకుంటే అశాంతిలో మునిగిపోవడమే తప్ప బయటకు రాలేడని తనకు తెలుసు. ఆ కొట్టువాడిని అరువడుగుదామన్నా – తనీ స్టేషన్‌కి కొత్తగా రావటానా, ఎవరితోనూ ఏ విధమైన మొహమాటాలూ పెట్టుకోకపోవడానా అతను తనకి అరువివ్వడన్నది తథ్యం. అయినా అప్పులూ, అరువులూ తన సిద్ధాంతాలకి పూర్తిగా శత్రువులు. అందుకే జాగ్రత్తగా జీతంతో బ్రతకడం నేర్చుకోగలిగాడు. ఒక్కసారీ సిద్ధాంతం సడలితే – జీవితాంతమూ తనకి మిగిలేది బాధే. ఏమైనా సరే, తను తన ఆదర్శాలను వదలిపోకూడదనుకున్నాడు తను. ఉన్నది ఒకే ఒక్క చీర.

అక్కయ్యా... నీరజా... ఇద్దరూ దాన్ని కోరుకుంటున్నారని ప్రత్యక్షంగానే తెలుసుకో గలిగాడు తను. నీరజ తన అర్ధాంగి. తన కష్టసుఖాలలో పాలు పంచుకోవలసిన వ్యక్తి. కాని తననూ తన పరిస్థితినీ అర్థం చేసుకోగలిగే ఎత్తుకి ఆమె ఎదగలేదు. వ్యక్తుల నర్థం చేసుకుని పరిస్థితి కనుగుణంగా మెలిగే ఓర్పు నీరజకింకా ఏ మాత్రమూ అలవడలేదు.

చీర తెచ్చినది తనకొరకు కాదని తెలిస్తే నీరజ చాలా మారిపోతుంది. ఈ విషయంలో తను ఏకాకి. ఆమె సహకారం లభించదన్నది నిశ్చయమైన విషయం.

అక్కయ్య. నిజంగా ఆమెకు కృతజ్ఞత సూచించుకుందుకిదే తరుణం. అన్ని విధాలు గానూ కలిసి వచ్చింది అవకాశం. పండుగకు చీర పెట్టినట్లూ, గతంలో ఆమె చేసిన మేలుకి కొంతవరకైనా కృతజ్ఞత తెలుపుకున్నట్లూ అవుతుంది.

నీరజ... తను... అక్కయ్య....


ఈ త్రిభుజం ఎల్లుండి ఉదయం ఎలాగూ చెదిరిపోతుంది. రేపు ఒక్కరోజు... కాని –– ఎలా ఎదుర్కోవడం ఆ రేపుని?

''కాళ్లు కడుక్కుని భోజనానికి రా తమ్ముడు!'' అతని మనసులోని ఆలోచనల కానకట్ట వేసిన అక్కయ్య పిలుపు విని శ్యామసుందర్ లేచి వెళ్లాడు.

'అతి చిన్న విషయాన్ని తను అనవసరంగా అత్యధిక ప్రాధాన్యం యిచ్చి ఆలోచిస్తున్నానా?' అనిపించిందొక్కసారి, కాని ఎంత సరిపెట్టుకోజూచినా... అతని సమస్య క్షణక్షణానికీ అంతులేనట్లు పెరుగుతూ అతని మెదడుని పూర్తిగా ఆక్రమించుకోసాగింది.

భోజనం చేస్తున్నంతసేపూ అతను అక్కయ్య ముఖంలోకి కానీ, నీరజ ముఖంలోకి కానీ చూడకుండానే తప్పించుకున్నాడు.

***



# వ్యవసాయం ఒక్కటే కథ కాదు



*'నౌపడ' రైల్వేస్టేషన్‌లో ఓ మిత్రుడు కలిసి దీపావళి పండుగ సందర్భంగా అనుకోకుండా, ముందు చెప్పకుండా ఇంటికొచ్చిన ఓ మహిళా అతిథికి చీరకొని పెట్టడానికి తాను పడినపాట్లు గురించి వివరించాడు. అప్పటికప్పుడే నా బుర్రలో కథ ఓ రూపం దాల్చి, ఇలా వెలుగు చూసింది. 70 శాతం వ్యవసాయకమూ, పేదరికమూ అనే విదేశానికి వర్తించే విషయం నిజమే అయినా కథలన్నీ అక్కడే పుట్టక్కర్లేదనీ... ప్యాంటూ చొక్కాలలో, యాసా, మాండలీకమూ లేని భాషలో, పేరా గ్రాపుల కొద్దీ రచయిత చొరబాటు లేకుండా కూడా కథలుండొచ్చనీ... 1967 దీపావళి కథల పోటీకి ఆంధ్రప్రభకు ఈ కథ పంపాను. బహుమతి అంటూ ఇవ్వకపోయినా 'మీ కథని ప్రత్యేక కథగా గుర్తించాం' అంటూ 25/-ల అధిక పారితోషికం పంపారు ఆ పత్రిక వారు. ఒక రకంగా చిన్న గెలుపే ఇది. నా మిగిలిన కథలలాగే 'చీర' కూడా మహిళా పాఠకులకు బాగా నచ్చింది. అత్తగారు, కోడలినీ, కొడుకుని ఎలా చూడాలనేది పరోక్షంగా (అక్క ద్వారా) చెప్పడం జరిగింది. ఎవరి స్థానాలేమిటో సూచించడం జరిగింది.*


**– ఇచ్ఛాపురపు రామచంద్రం**

**సెల్ 80198 00207**


కిటికీలోంచి ఆకాశంలో తారకలు మిలమిలా మెరుస్తూ కనిపిస్తున్నాయి.

శ్యామసుందర్‌కీ నీరజ కళ్లు గుర్తుకువచ్చాయ్. ఆమెకు దగ్గరగా జరిగి ... ''నీ... ర...జా'' అంటూ మెల్లిగా పిలిచాడు.

ఆమె అతని వంక చూసింది.

''ఏమిటాలోచిస్తున్నావ్?''

''ఆ నీలం చీరలో నేనెంత అందంగా ఉంటానా అని!''

షాక్ తగిలినట్లు ఆమెకు మళ్లీ దూరంగా జరిగి చాలా భావాలు నిండిన కళ్లతో ఆమె వంక చూసేడు. కాని, జెడ్‌లైట్ మసక వెలుతురులో... తన ఊహల సాంద్రతలో... ఆమె అతని కన్నులలోని భావాలను కొంచం కూడా గ్రహించలేకపోయింది.

ఆడవాళ్లకీ కొత్త చీరలకీ అవినాభావ సంబంధం.

నీరజ, అక్కయ్య ఇద్దరూ ఆడవాళ్లు.

అతనికి నవ్వు రాలేదు. జాలివేసింది.

రేపటి నీరజ ప్రవర్తనకి చాలా ప్రాముఖ్యం ఉంది. ఆమె మనస్ఫూర్తిగా సహకరించకపోతే దీపావళి ఆనందంగా గడవదు. అక్కయ్యదృష్టికి తను – నీరజ మధ్య ఏ కొంచెం దూరం తోచినా – ఆమె తమను చూసి జాలిపడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. వద్దు వద్దు... తమ కొత్తకాపురం జాలిపడవలసినంత స్థాయికి దిగజారకూడదు. ఎలాగయినా నీరజకు నచ్చజెప్పాలనుకుంటూ అతను నీరజ వంక చూసేడు.

మంచుతో తడిసిన మందారంలా ముకుళించుకుని నిద్రపోతూంది.

''నీరజా...'' పిలిచాడు మెల్లిగా.

ఆమెలో కొంచమైనా చలనం కలిగించలేదా పిలుపు.

''నీరజ నిద్ర నటిస్తూందా?'' అనిపించిందతనికి.

అలా అయితే ఆమెను నిద్రలేపడమూ, తను చెప్పదలుచుకున్న విషయాలు చెప్పడమూ – అన్నీ వ్యర్థమై – ఆమెకనవసరంగా రెచ్చగొట్టినట్లవుతుంది. ఆ చీర తనకు కాదని తెలిస్తే నీరజ భరించలేదు. ఆ విషయం ఆమెకు చెప్పి పరిస్థితిని విషమింపజేసుకోడం కంటె రేపటి వరకూ మౌనంగానే ఉండటం మంచిదన్న నిశ్చయానికి వచ్చేశాడతను.

***

''ప్లీజ్... ఎనిమిది దాటిపోతూంది... లేవండి...''

అతను కళ్లు తెరిచేసరికి బ్రష్షూ – పేస్టూ టేబిలు మీద పెట్టి వెళ్లిపోయింది నీరజ. అతని కళ్లకి మొదట కనిపించింది టేబుల్‌మీది చీర మడత!

వెండి తీగెలవంటి బోర్డర్లతో ఆకాశం లాంటి నీలిచీర.

చూడలేనట్లు వెంటనే అతను బాత్‌రూముకి నడిచాడు.

కొత్త ఫ్రాక్ తొడుక్కున్న శ్యామా గుడ్ మార్నింగ్ చెప్పింది.

పళ్లు తోముకుంటూ నీరజవంక చూశాడు శ్యామసుందర్.

లేయెండలో నిలుచుని శిరోజా లార్చుకుంటున్నదామె రోజాకంటె వెయ్యి రెట్లు అందంగా కనిపిస్తూ.

అతను స్నానం చేసి వచ్చేసరికి కూడా ఆమె అలాగే నిలుచుంది.

ఆమె చెక్కిళ్లమీద పడుతున్న సూర్యకిరణాలు ఆ నునుపుతనాని కీర్ష్యపడి తమ మెరుపుని కూడా ఆమె చెక్కిళ్లపైనే వదిలేసి ఈర్ష్యగా జారిపోతున్నాయి. ఈ క్షణాలలో... నీరజ... ఆ నీలిచీర కూడా కట్టుకుంటే... అతని మనస్సులో మధురమైన ఊహలు ఉదయించాయి.

ఒక్కసారి నీరజ ఏకాంతంలో కావాలనిపించింది. కాని అంతలోనే తను ఉంటున్న క్వార్టర్స్ విషయం గుర్తుకువచ్చి తన తీయని ఊహలను బలీయంగా చెరుపుకునేందుకు ప్రయత్నించసాగాడు.

కిచెనూ, డ్రాయింగ్ రూమూ కాక మరొక చిన్న గది. ఇవీ తన ఇల్లు. మూడు గదులూ ఒకే వరసలో ఉండటం వల్ల ఇంట్లో అక్కయ్య ఉండగా పగలు పూట తమకు ఏకాంతం లభించటం అతికష్టం. ఒకవేళ తను త్వరపడి, కాంతులీనుతున్న నీరజ నున్నని చెక్కిళ్లపై ప్రేమగా ఏమయినా చేస్తే – ఇద్దరూ అక్కయ్యకంట పడకా మానరు, ఆమె తమని చూసి నవ్వకా మానదు.

''లోపలకు పదండి... టిఫిన్ తీసుకుందాం...''

నీరజ మాటలు విని అతను ముందు గదిలోకి వచ్చాడు.

టేబుల్‌కి మూడు వైపుల కుర్చీలు. టేబుల్‌మీద మూడు పక్కల టిఫిన్ ప్లేట్లూ మంచినీళ్లూ అమర్చబడి ఉన్నాయి.

కొద్ది నిమిషాలలో నీరజా శారదా కూడా వచ్చి అతని కటూ ఇటూ కూర్చున్నారు. టేబుల్‌పై ఒక మూలగా ఆ చీర, నీలిచీర!

టీ తీసుకున్నాక మెల్లిగా అన్నాడు శ్యామసుందర్. ''కొత్తబట్టలు కట్టుకునేది ఇప్పుడేగా?''

''ఊహు... ఇప్పుడు పసుపుపెట్టి, దీపాలు పెట్టేక కట్టుకుంటే ఆ వెలుగులో బాగుంటుంది–'' సమాధాన మిచ్చింది శారద.

అదే క్షణంలో నీరజ ఏదో అనబోయి కూడా వదినను చూసి మానేసింది.

అతను గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నాడు. పరీక్ష క్షణాలు వాయిదా పడ్డాయని క్షణికంగా సంతోషించినా ఆ క్షణాలెప్పుడైనా ఎదుర్కోక తప్పవని మరుక్షణమే గుర్తుకు వచ్చేసరికి అతని ఆనందం మటుమాయమై మళ్లీ అశాంతే ఆవరించుకుంది. పడబోయే పిడుగుకోసం ఘడియలు లెక్కించడం అతి బాధాకరమని అతనికి తెలిసిందా క్షణాలలో.

ఎక్కడినించో పరుగెత్తుకు వచ్చి శ్యామా అతని ఒడిలో వాలడంతో అతను మళ్లీ ఊహాలోకం నించి వాస్తవంలోకి రావలసి వచ్చింది.

''రైలుబళ్లు చూపించవూ మామయ్యా?'' గోముగా అడిగింది శ్యామా అతని చేయి పట్టుకుని లాగుతూ. శారదా నీరజల సాన్నిధ్యం నుంచి తప్పించుకుందుకే ఎదురు చూస్తున్న శ్యామసుందర్ ఆ అవకాశం వినియోగించుకోవాలని – ''నేనూ శ్యామా అలా స్టేషన్‌కి వెళ్లి వస్తాం'' అంటూ శ్యామాను నడిపించు వెళ్లసాగాడు.

ప్లాట్‌ఫారం చివర వేపచెట్టు నీడల్లో సిమెంట్ బెంచిమీద కూర్చున్నారు ఇద్దరూ.

శ్యామా ఏవో యక్ష ప్రశ్నలు వేస్తూంది రైళ్లను గురించి.

అన్యమనస్కంగా అతను జవాబులు చెబుతున్నాడు.

అతని మెదడులోని ఆలోచనలకు మల్లే లైన్ల మీద రైళ్లు వస్తూ పోతూ ఉన్నాయి -- రెండు నిమిషాలకు మించి ఏ బండీ ఆగనవసరం లేని చిన్న స్టేషనది.

అకస్మాత్తుగా ఒక ఆలోచన వచ్చిందతనికి.

''ఏదో ఒక వేలు పట్టుకో శ్యామా!'' అంటూ చూపుడువేలూ, నడిమివేలూ మినహా మిగిలినవన్నీ ముడిచి చెయ్యి ఆమె ముందుకి చాపేడు.

మామయ్య ముఖంలోకి ఓసారి చూసి, రెండు వేళ్లనూ పరిశీలించి ఉంగరం మెరుస్తున్న చూపుడు వేలిని పట్టుకుంది శ్యామా. ''గుడ్ –'' అంటూ శ్యామాను దగ్గిరగా తీసుకుని అతను గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. విజేతలా గలగల నవ్వింది శ్యామా, ఒక్క నిమిషం పోయాక ఏదో అనుమానం వచ్చినట్లు ''ఈ వేలే ఎందుకు పట్టుకున్నావు?'' అంటూ ప్రశ్నించాడతను కుతూహలంగా.

''చిన్నదిగా... అందుకని...''

ఆమె సమాధానంలో అతనికేదో జీవన న్యాయం గోచరించినట్లయింది. ఆ క్షణంలో అతని కన్నులు కాంతివంతాలయ్యాయి.

మళ్లీ ఆలోచనలు..

శ్యామా నిర్ణయం నీరజకనుకూలంగా ఉంది. కాని, తను అక్కయ్య పట్ల నెరవేర్చవలసిన విధిని విస్మరించడం న్యాయమేనా?

''ఇంటికి పోదాం మామయ్యా... ఆకలౌతుంది''. శ్యామా మాటలు విని అతను లేచాడు. ఒక్కసారి ప్లాటుఫారం కలియజూసి మెల్లగా శ్యామా వేలు పట్టుకుని నడిపించసాగాడు. తనలో తనకే అనిపించింది – 'నేను చాలా అనవసరంగా ఆలోచిస్తున్నానా ఆ చీర గురించి–' అని. చిన్నప్పటినించీ అందరూ అనేమాటే ''తనెక్కువగా ఆలోచిస్తాడతి చిన్న విషయాల గురించి కూడా'' అని. ఇప్పుడా మాటలు నిజమే అని తనే రుజువు చేసుకుంటున్నాడు. తనుచేసిన పొరపాటు –